






AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com


## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శనివారం సందర్శించారు. సాధారణ తనిఖీలో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ సీల్‌లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సిబ్బంది, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులున్నారు.


2-5-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2






కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో షబ్బీర్ అలీ కుమారుడు ఎమ్మెల్యేపై పరువు నష్టం దావా వేశారు. దీంతో నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు ఆయన సమన్లు జారీ చేయడం తీవ్ర చర్చకు దారి తీసింది. – అక్షరటుడే, కామారెడ్డి

# హీటెక్కిన రాజకీయం..

- తారాస్థాయికి ఎమ్మెల్యే వర్సెస్ షబ్బీర్ అలీ వివాదం
- కేవీఆర్‌పై పరువు నష్టం దావా
- నోటీసులు పంపించిన షబ్బీర్ అలీ కుమారుడు

కామారెడ్డిలో మూడు నెలల క్రితం ఇద్దరు నేతల మధ్య సాగిన మాటల యుద్ధం సంచలనం రేపింది. ఎమ్మెల్యే అవినీతికి కేరాఫ్ అడ్రస్ అంటూ షబ్బీర్ అలీ వ్యాఖ్యానించగా అదే స్థాయిలో షబ్బీర్ అలీకి ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకుల విమర్శలు, సవాళ్లతో అప్పుడు కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. సదరు నేతలు కుటుంబ సభ్యులపై సైతం విమర్శలు చేశారు. ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకుంటున్న క్రమంలో డిగ్రీ కళాశాల ఆస్తులపైకి వివాదం మళ్లి తీవ్ర దుమారం రేపింది. ఎమ్మెల్యే ఇంటివద్ద ఆందోళన, కాంగ్రెస్ నాయకుల అరెస్ట్ అంశాలు కామారెడ్డిలో రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపాయి. దాంతో ఇద్దరి మధ్య వివాదం తారాస్థాయికి చేరింది.

### పరువు నష్టం దావా..

కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల తర్వాత షబ్బీర్ అలీ ప్రెస్ మీట్ నిర్వహించి ఎమ్మెల్యే అవినీతి కింగ్ అని, కళాశాల ఆస్తుల అంశాన్ని లేవనెత్తారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారు. షబ్బీర్ అలీకి ఎన్నికలు అంటే కలెక్షన్ అని, ఆయన కొడుకుపై రేప్ కేసు ఉందని, అది బయటకు తీస్తానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. దీంతో తనపై చేసిన వ్యాఖ్యలపై షబ్బీర్ అలీ కొడుకు ఇలియాస్ నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. తనపై ఎమ్మెల్యే అవాస్తవ, అసత్య ఆరోపణలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పరువు నష్టం దావా వేశారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 20న కోర్టుకు హాజరు కావాలని పేర్కొంది.

### ఎమ్మెల్యే స్పందనపై ఉత్కంఠ

గత ఫిబ్రవరి నెలలో ఎమ్మెల్యే ఆరోపణలు చేసిన సమయంలో తన వద్ద ఆధారాలు ఉంటేనే మాట్లాడతానని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలపై నోటీసులు జారీ చేయడంపై ఎమ్మెల్యే ఎలా స్పందిస్తారనే ఉత్కంఠ కొనసాగుతోంది. కోర్టు నోటీసుల ప్రకారం ఈ నెల 20న ఎమ్మెల్యే కోర్టుకు హాజరవుతారా..? ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు కోర్టుకు సమర్పిస్తారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



## మూడు వారాలు.. 432 డ్రంకన్ డ్రైవ్ కేసులు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు వారాల్లో 432 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారికి రూ.40 లక్షలకు పైగా కోర్టులు జరిమానాలు విధించాయని వెల్లడించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ తదితర ప్రాంతాల్లో మూడు వారాల్లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో 432 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా వారిని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టులలో ప్రవేశపెట్టగా.. 25 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష పడిందని చెప్పారు. మిగతా వారి వద్ద నుంచి రూ.40,25,000 జరిమానాలు వసూలు చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి లైసెన్సు ఆరు నెలల పాటు సస్పెండ్ చేయనున్నట్లు హెచ్చరించారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. నాన్ మైనారిటీ విభాగంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అదేవిధంగా మైనారిటీ విభాగంలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మైనార్టీ విద్యార్థులు అప్లయ్ చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈనెల 7న లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9490863874, 9014630770 నంబర్లలో లేదా పని వేళల్లో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

## తెలంగాణలో మోదీ పర్యటన పక్కా పొలిటికల్..: అర్వింద్



**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన పక్కా పొలిటికల్ అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కామారెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం మొట్టమొదటి సారిగా తెలంగాణాలో ప్రధాని మోదీ పర్యటించడం ప్రతిపక్ష పార్టీలలో తాజా చర్చకు దారి తీసిందన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ గెలవబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని, ఇక రీజినల్ పార్టీలలో అందరికి అభద్రతాభావం, వణుకు మొదలైందన్నారు. వెస్ట్ బెంగాల్‌లో రీజినల్ పార్టీగా ఎదిగిన ప్రాంతంలో మమతా బెనర్జీని ఓడించడం డిఫరెంట్ లెవల్ అని పేర్కొన్నారు. అక్కడ గెలిచిన పార్టీ ఎక్కడైనా గెలుస్తుందని చెప్పారు. తెలంగాణలో రూ.7,823 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.2,360 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ పనులకు శంకుస్థాపన, ఇతర రాష్ట్రాల నుంచి మహబూబ్‌నగర్ 161 నేషనల్ హైవేపై నాలుగు లైన్ల రహదారి పనులకు రూ.3,175 కోట్లు పీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే అమృత్ భారత్ పథకం కింద రూ.40 కోట్లతో ఆధునీకరించిన రెండు రైల్వే స్టేషన్లు, రూ.200 కోట్లతో వరంగల్‌లో నిర్మించిన పీఎం మిత్ర టెక్స్ టైల్ పార్కు, రూ.611 కోట్లతో నిర్మించిన రైల్వే టెర్మినల్స్, రూ.1243 కోట్లతో కాజీపేటవిజయవాడ వరకు మూడు లైన్ల రైల్వే పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఎంపీ వివరించారు. అనంతరం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సుమారు మూడు లక్షల మందితో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, అరుణ తార, బీజేపీ రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన అన్నదాతలు




**అక్షరటుడే, కామారెడ్డి/ఆర్మూర్:** ధాన్యం కోతలు పూర్తయి నెలరోజులు గడుస్తున్నా కొనడం లేదని అన్నదాతలు కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ సిబ్బంది గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. నెల రోజులుగా ఎదురు చూస్తున్నా పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రైతులు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాము ఎండలో సతమతం అవుతుంటే అధికారులు పట్టించుకోడం లేదని మండిపడ్డారు. వెంటనే కాంటాలు వేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రం వద్దకు డీఆర్డీఏ పీడీ సురేందర్ చేరుకుని రైతులతో మాట్లాడారు. రెండు రోజుల్లో కాంటాలు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అలాగే ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ రహదారిపై శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు నచ్చు చిన్నారెడ్డి, అల్లూరు గంగారెడ్డి, పాలెపు రాజు, రవి రెడ్డి, మోహన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి అధికారులు వారధిగా నిలవాలి: ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ ఉద్యోగులు.. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి ప్రజాభివృద్ధికి కృషి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని శ్రీరామ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రంలోనే నిజామాబాద్‌ను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ప్రజలు చెప్పే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అలాగే శాఖాపరంగా ఏదైనా సమస్యలు వస్తే ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల పనితనం మెరుగుపడాలని, ప్రతి అధికారి ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, నుడా ఛైర్మన్ కేశ వేణు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, పసునూరి రాము, శ్రావణ్ కుమార్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేరడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి అధికారి ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరించి, వారి ఫిర్యాదులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలపైనే కాకుండా, అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మరింత సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఆర్డీవో గిరి, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు లక్ష్మి, రాజు, నియోజకవర్గ సర్పంచులు, జిల్లా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మనలో మనమే కొట్టుకుంటే అభివృద్ధి కుంటుపడుతుంది..: రాకేష్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్ :** మనలో మనమే కొట్టుకుంటే అభివృద్ధి కుంటుపడుతుందని.. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే రాజకీయ ఐక్యత ఉండాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సప్తగిరి ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే అందరం ఐక్యంగా ఉండాలన్నారు. ఆర్మూర్‌లో గతంలో కక్షలు, ద్వేషాలు ఉండేవని ఈ రెండేళ్లలో అవి కనబడకుండా పోయాయన్నారు. అంతకు ముందు మెప్మా ఆధ్వర్యంలో స్వయంసహాయక సంఘాల ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించారు. ఆ తర్వాత కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీఐ రాహుల్ కుమార్, తహశీల్దార్ సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సారంగి శాంతి కుమార్, కౌన్సిలర్ పాన్ శ్రీను, నాయకులు అధికారులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డి డివిజన్‌లో ప్రతి సోమవారం 'ప్రజావాణి'



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆర్డీవో రోడ్డ ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలు, వినతులను స్వీకరిస్తారు. స్వీకరించిన అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. కాబట్టి ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.





ఆర్మూర్ మున్సిపాలిటీలో కమిషనర్ల బదిలీల పర్వం కొనసాగుతోంది. ఐదు నెలల వ్యవధిలో ఏకంగా నలుగురు కమిషనర్లు మారడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. నెలకొక కమిషనర్ మారుతుండడంతో ప్రజలకు ముఖ్యమైన పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, లైటింగ్ వంటి సమస్యలు పూర్తిగా పక్కదారి పట్టాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక కమిషనర్ సమస్యను తెలుసుకుని పరిష్కరించేలోపే బదిలీ అవుతుం డడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోతున్నాయి.

– అక్షరటుడే, ఆర్మూర్









# ఐదు నెలలు..

# నలుగురు కమిషనర్లు..

■ ఆర్మూర్ మున్సిపాలిటీలో 'కమిషనర్ల' క్యూ ■ అస్తవ్యస్తంగా పురపాలన
■ అభివృద్ధికి ఆమడదూరంలో బల్దియా ■ మౌలిక సదుపాయాల కల్పనలో గందరగోళం

ఆర్మూర్ మున్సిపాలిటీకి 2018లో గ్రేడ్ 2 హోదా వచ్చింది. 80వేల పైచిలుకు జనాభా 36 వార్డులు ఉన్న పట్టణంలో స్థిరమైన పాలన లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు వెళ్లిపోయాక నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ రవిబాబును ఆర్మూర్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమించారు. 15 రోజుల వ్యవధిలోనే ఆ స్థానంలో గ్రూప్–1 అధికారిణి పూజారి శ్రావణిని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. నెల రోజులపాటు విధులు నిర్వహించిన శ్రావణి హైదరాబాద్‌లో 48 రోజుల పాటు శిక్షణకు వెళ్లి పోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రామగుండం మున్సిపాలిటీలో సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావును డిసెంబర్ 23న ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. కాగా.. మూడు నెలలపాటు కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆయన గురువారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజును నియమితులయ్యారు. మరి ఈ కమిషనర్ ఎన్ని రోజులు ఉంటారో చూడాలి.

### మున్సిపల్ పాలనపై ప్రభావం..

తరచూ కమిషనర్లు మారడంతో ఫైల్ ముందుకు కదలడం లేదు. కమిషనర్లకు అధికారిక కార్యకలాపాల కోసం డిజిటల్ కీ వచ్చేలోపే బదిలీ అవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో బల్దియాలో ఫైళ్లు కుప్పలుకుప్పలుగా సెక్షన్లలో పేరుకుపోతున్నాయి. కమిషనర్లకు మున్సిపాలిటీపై అవగాహనకు వచ్చేలోపే బదిలీలు కావడంతో శానిటరీ వ్యవస్థతోపాటు మున్సిపల్ కార్యాలయంలోని సెక్షన్లలో అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. ఫుట్‌పాత్‌లు, పార్కు స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రాజకీయ ఒత్తిళ్లు మరోవైపు..

రాజకీయ ఒత్తిడితో సైతం అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారని సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఆర్మూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పరం కావడం.. మరోవైపు నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యే అధికారంలో ఉండడంతో ఆధిపత్య పోరు నడుస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి నియమించిన కమిషనర్లను కనీసం రెండేళ్లు కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని సోమరేగడి తండా, లక్ష్మాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మండల అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో తహేరాబేగం, ఎంపీవో ప్రకాష్, ఏపీవోతో పాటు స్థానిక సర్పంచులు పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి తాపం నుంచి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు ఎక్కువగా తాగాలని అధికారులు సూచించారు. పనుల నాణ్యతను పెంచాలని, హాజరు నమోదు సక్రమంగా ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈజీఎస్ కూలీలకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## విద్యార్థిని షర్మిష్టను సన్మానించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, భిక్కనూరు:** పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించిన షర్మిష్టను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఘనంగా సన్మానించారు. శనివారం భిక్కనూరుకు వచ్చిన ఆయన విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షర్మిష్ట తాతకు దగ్గ మనమరాలు అని నిరూపించుకుందన్నారు. షర్మిష్ట తాత నాగభూషణం ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత రాణించి కుటుంబానికి భిక్కనూరుకు మరింత పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, సర్పంచ్ బల్యాల రేఖ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు సుదర్శన్, దుంపల మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్ గౌడ్, లింబాద్రి, జ్ఞాన ప్రకాశ్ గౌడ్, రవి, నీల అంజయ్య, కటికె మీన పాల్గొన్నారు.

## టీఎస్ఆర్‌జేసీ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ సెట్ (టీఎస్ఆర్‌జేసీ) పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. మే 3వ తేదీన నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ డివిజన్‌లో పరీక్ష నిర్వహించేందుకు పోలీస్‌శాఖ తరపున ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని మొత్తం 33 పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రం నుంచి 100 మీటర్ల పరిధిలో ఇద్దరు కంటే ఎక్కువ మంది గుమిగూడడం నిషేధమన్నారు. జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

## మాచాపూర్‌లో స్నేహ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మాచాపూర్ గ్రామ పంచాయతీలో 45 రోజుల 'స్నేహ సమ్మర్ క్యాంప్' శనివారం ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమంలో తహశీల్దార్ ప్రేమ్ కుమార్, సర్పంచ్ ఎం శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ గంగమ్మ, ఏపీఎం రామనారాయణ గౌడ్ పాల్గొని 10 మంది కిశోర బాలికలను పరిచయం చేసుకున్నారు. బాలికల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ 45 రోజుల సమ్మర్ క్యాంప్‌ను కిశోర బాలికలతో పాటు వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలికలు కూడా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. సమాజంలో ఉన్నతంగా జీవించడానికి అవసరమైన నైపుణ్యాలు, మెళకువలను ఈ కార్యక్రమం ద్వారా బాలికలు తెలుసుకుంటారని, ఇది వారికి మంచి దిక్సూచిగా ఉపయోగపడుతుందని తహశీల్దార్ ప్రేమ్ కుమార్ అన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవో ఓబీ మణెమ్మ, షాబెరా, సీసీ సంధ్య, జీపీవో, ఆశా వర్కర్, వీవోఏ తదితరులు పాల్గొన్నారు.

## 5న ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్ష

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మే 5న కామారెడ్డిలో సామూహిక నిరాహారదీక్ష చేయనున్నారు. ఈ మేరకు టీజీఈజేఏసీ నేతలు శనివారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా టీజీఈజేఏసీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరాహార దీక్షల్లో భాగంగా కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట మే 5న నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సభ్యులతో ఎల్లారెడ్డిలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహిపాల్, పట్లోళ్ల శ్రీనివాస్, ఎండీవో ప్రకాష్, వినయ్ కుమార్, డీటీ శ్రీనివాస్, ఎ కిష్టయ్య, ఎం కృష్ణమూర్తి, కె.దాసిరాం, కె.సంగయ్య, బి.లక్ష్మణ్, పెన్షనర్లు పాల్గొన్నారు.



## మాచాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మాచాపూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని (పీపీసీ) శనివారం ఆర్డీవో రోడ్డ ప్రభాకర్, ఎల్లారెడ్డి తహశీల్దార్ ప్రేమ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని సెంటర్ ఇన్‌చార్జికి అధికారులు సూచించారు. రవాణా సంబంధిత లేదా ఇతర సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోపు ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులు తెలిపారు.



## సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి విరాళం

**అక్షరటుడే, భిక్కనూరు:** దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి ఇటీవల పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించిన విద్యార్థిని షర్మిష్ట ముందుకొచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఆలయానికి రూ.5,100 అందజేశారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో షర్మిష్టను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామగిరి శర్మ, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్ లింబాద్రి, వైస్ ఛైర్మన్ దయాకర్ రెడ్డి, దాత తల్లిదండ్రులు విజయ్‌కుమార్ గౌడ్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలూర్ గ్రామసభలో సమస్యల పరిష్కారంపై చర్చ

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలూర్ గ్రామంలో సర్పంచ్ ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సభలో చర్చించారు. గ్రామస్థులు తమ సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరేలా గ్రామస్థుల సహకారం అవసరమన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లేష్, ఉప సర్పంచ్ ఏలేటి మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు ప్రవీణ్, సంజీవ్, కరాబర్ సంతోష్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.




## పల్లె దవాఖానా తనిఖీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ముదక్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని గుండారం పల్లె దవాఖాన ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో రాజశ్రీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న ఆరోగ్య సేవలు, హాజరు, స్టాక్ రిజిస్టర్ తదితర వివరాలు తెలుసుకున్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ రహిత గ్రామం కోసం కృషి చేయాల న్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆరోగ్య సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలన్నారు. ఆమె వెంట ఎంఎల్‌హెచ్‌పీ కవిత, ఆరోగ్య కార్యకర్త రఘు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.





# రైతులకు ధాన్యం విక్రయ కష్టాలు..

**అక్షరటుడే, లింగంపేట:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడం అన్నదాతలకు కత్తిమీద సాముగా మారింది. యాసంగిలో సాగుచేసిన పంటలను విక్రయించేందుకు అన్నదాతలు కేంద్రాల్లో నిరీక్షణ తప్పడం లేదు. దీనికి తోడు విక్రయించిన పంటను రైస్‌మిల్లుల వరకు తరలించేందుకు అన్నదాతకు ఇక్కట్లు తప్పడం లేదు. ఒక పక్క లారీలు సరిగ్గా రాకపోవడంతో తూకాలు వేగంగా జరగట్లేదు. మరోవైపు తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలించే లారీలు మారమధ్యలో నిలిచిపోవడం కూడా సమస్యగా మారుతోంది. అధిక లోడ్‌తో పాటు లారీల్లో ఇష్టానుసారంగా బస్తాలను ఎక్కించడంతో అవి రైస్‌మిల్లులకు వెళ్లే లోపల రోడ్లపై బస్తాలు జారిపడిపోతున్నాయి. దీంతో రైతులకు కొత్త తిప్పలు వస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు లింగంపేట నుంచి కామారెడ్డి వరకు 25 కిలోమీటర్లు వ్యవధిలో రెండు లారీలు ధాన్యం బస్తాల కింద పడడంతో అన్నదాతలు ఆగమయ్యారు. శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలో ఓ లారీ నుంచి బస్తాలు కింద పడడంతో రైతులు రోడ్లపైనే ఎర్రటిఎండలో వడ్లు ఎత్తుతూ కనిపించారు. లింగంపేట మండలం బురిగిద్ద వద్ద లారీ మొరాయించడంతో రోడ్డుపై నిలిపివేశారు.